

భోజనంతో రోబోలు



కస్టమర్లకు వడ్డించడానికి భోజనం తీసుకొస్తున్న రోబోలు

హాయ్.. ఐయామ్ మైత్రి ఆర్డర్ ప్లీజ్..

కస్టమర్లను ఆకర్షించేందుకు వ్యాపారులు రకరకాల ఆఫర్లు ప్రకటిస్తుంటారు. అయితే, సిద్దిపేటకు చెందిన ఓ హోటల్ యజమాని వినూత్నంగా ఆలోచించాడు. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో రోబో 2.0 రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ఇందులోకి వచ్చే అతిథులకు "నమస్కారం.. రోబో 2.0 రెస్టారెంట్‌కు స్వాగతం" అంటూ రోబో వెయిటర్లు ఆహ్వానం పలుకుతున్నాయి. అంతే కాదు.. నా పేరు మైత్రి ఫుడ్ ఆర్డర్ చేయండి.. అంటూ ఆర్డర్ తీసుకుంటున్నాయి. కాసేపటికి టేబుల్ వద్దకు ఆహారాన్ని తీసుకొస్తున్నాయి. రోబోల సర్వీసుతో కస్టమర్లు కూడా కొత్త అనుభూతి పొందుతున్నారు. చార్జింగ్ బ్యాటరీల సహాయంతో పనిచేస్తున్న రోబోలతో వెయిటర్స్ ఇబ్బందులు తగ్గాయని నిర్వాహకులు తెలిపారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్లు, అధికారులు

ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యచరణ
- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

7

నేరస్థులకు శిక్ష పడితేనే నేరాలు తగ్గుముఖం

- పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించాలి : సీపీ డాక్టర్ బి. అనురాధ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటక్రైం, ఫిబ్రవరి 3: నేరస్థులకు శిక్షలు పడితేనే నేరాలు తగ్గుముఖం పడతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. అలాగే పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. కోర్టు డ్యూటీ నిర్వహించే సిబ్బందితో కమిషనర్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్క కోర్టు కానిస్టేబుల్ కోర్టు క్యాలెండర్ తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని పేర్కొన్నారు. సాక్షులను షెడ్యూల్ ప్రకారం తప్పకుండా కోర్టులో హాజరుపర్చాలని, నాన్‌బెయిలబుల్ వారెంట్ వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ట్రయిల్ బ్రేక్ కావొద్దని హెచ్చరించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ట్రయల్ సమయంలో సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికారులు తప్పకుండా మానిటర్ చేయాలని చెప్పారు. క్రమం తప్పకుండా కోర్టుకు వెళ్లాలన్నారు. చార్జిషీట్ దాఖలు చేసేప్పుడు అన్ని పేపర్లు పరిశీలించాలని సూచించారు. పారదర్శకంగా విధులు నిర్వర్తించే సిబ్బందికి అవార్డులు, రివార్డులు అందజేస్తామని సీపీ తెలిపారు. కోర్టు విధుల్లో ప్రతిభ కనబర్చిన రామరాజు సిద్దిపేట వన్‌టౌన్, విఠల్ జగదేవపూర్, సంజీవ్ కోహెడ, శ్రీనివాస్ చిన్నకోడూరు, సూరజ్ బేగంపేట, వెంకట్ చేర్యాలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ఎస్.మల్లారెడ్డి, సీసీఆర్బీ సీఐ గురుస్వామి, సీసీఆర్బీ ఎస్ఐ అపూర్వ, ఐటీసెల్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు లైజనింగ్ హెడ్‌కానిస్టేబుల్ రాజమల్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఏడుపాయల జాతర ఏర్పాట్ల ఊసేది?

- ఇంకా సమీక్ష సమావేశమే నిర్వహించలేదు
- ప్రతీసారి ఆలస్యంగా పనులు

7

లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్!



- డాక్యుమెంట్ రైటర్ల హవా.. సబ్ రిజిస్ట్రార్లతో కుమ్మక్కు
- కాదని నేరుగా వెళ్తే నో రిజిస్ట్రేషన్
- అదేమని అడిగితే తప్పుగా ఉందని అధికారుల మండిపాటు
- 'నాలా' కనెక్షన్ లేకున్నా అనుమతులు!
- గతంలో ఏసీబీ దాడులు చేసినా మారని వైఖరి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3 : సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తికి ఇటీవల ప్రభుత్వం లోన్ మంజూరు చేసింది. అగ్రిమెంట్ పేపర్‌పైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపు వేసుకుని రావాలని బ్యాంకు అధికారులు లబ్ధిదారునికి సూచించారు. ఈ మేరకు మధ్యాహ్నం 2.45 గంటలకు పట్టణంలోని కార్యాలయానికి వెళ్లి అగ్రిమెంట్‌పై స్టాంపు వేయాలని సిబ్బందిని కోరాడు. సమయం 3 దాటిందని, ఇప్పుడు కార్యాలయం బంద్ చేశామని సిబ్బంది సమాధానమిచ్చారు. అదేంటి.. పనివేళలు 5 గంటల వరకు కదా అని అడిగితే.. స్టాంపు వేసే సమయం 3 గంటల వరకేనని సిబ్బంది సమాధానమివ్వడంతో సదరు వ్యక్తి నివ్వెరపోయాడు. ఎలాగైనా స్టాంపు వేయించుకోవాలన్న ఆశతో లబ్ధిదారుడు కార్యాలయం ఎదుటే నిల్చున్నాడు. గమనించిన కార్యాలయ సిబ్బంది అతని వద్దకు వచ్చి తమకు డబ్బులు ఇస్తే స్టాంపు వేసిస్తామని చెప్పడంతో చేసేదేమీ లేక అందుకు ఒప్పుకున్నాడు. స్టాంపు విలువ పోను అదనంగా రూ.800 ఇవ్వాలని ముందే చెప్పారు. ఇది కేవలం ఒక్క సేవలకో.. ఒక్క కార్యాలయానికో మాత్రమే కాదు.. ప్రతిపనికీ ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే తంతు కొనసాగుతున్నది.



సిద్దిపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

డాక్యుమెంట్ రైటర్లదే హవా

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలన్నింటిలోనూ డాక్యుమెంట్ రైటర్ల హవా నడుస్తున్నది. సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లు, సిబ్బంది కుమ్మక్కై ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లను కాదని నేరుగా వెళ్తే పత్రాల్లో తప్పులున్నాయని చెప్పి అక్కడి నుంచి పంపిచేస్తున్నారు. ప్రజలు కూడా చేసేది లేక సంబంధిత డాక్యుమెంట్ రైటర్లు అడిగినంతా ఇచ్చి పని చేయించుకుంటున్నారు.

'నాలా' కనెక్షన్ల అనుమతి లేకున్నా

వ్యవసాయభూమిని తీసుకున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దానిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు, వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్ (నాలా) అనుమతి పొందాల్సి ఉంటుంది. ఆ అనుమతి లేనిదే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు రిజిస్ట్రేషన్‌ను చేయరు. కానీ కొన్నిచోట్ల నాలా అనుమతి లేకున్నా భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సిద్దిపేట పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చాలా వరకు అనుమతులు పొందకుండానే ప్లాట్లు చేసి, రిజిస్ట్రేషన్ చేశారన్న ఆభియోగాలున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకిలీ వీలునామాలు, దానపత్రాల విషయంలో కూడా అవినీతికి పాల్పడుతూ రిజిస్ట్రేషన్లు చేయడంతో ఆస్తుల విషయంలో కుటుంబ తగదాలు జరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితులు ఎంతోమంది ఉన్నారు.

పనిని బట్టి రేటు

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్కో పనికి ఒక్కో రేటును నిర్ణయించారు. భవనాలు, ఖాళీస్థలాలు, వ్యవసాయేతర భూములకు 'నాలా' అనుమతి తీసుకుంటే ఒకలా, అనుమతి తీసుకోకుంటే మరొకలా డబ్బు వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు అదనంగా సిబ్బందికి చెల్లించుకోక తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్నిచోట్ల ఒకేసర్వేనంబర్‌తో రెండు, మూడు డాక్యుమెంట్లు చేయడం, లిటిగేషన్ ఉన్న డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేసి అందినకాడికి దండుకుంటూ భూ వివాదాలకు కారణమవుతున్నారు. గతంలో ఏసీబీ అధికారులు పలుమార్లు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసి జైలుకు పంపినా కూడా అధికారుల్లో మార్పు కనపడడం లేదు.

పనివేళల్లో మార్పు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు మూసివేయాలి. కానీ సిద్దిపేట పట్టణంలో అధికారులు, సిబ్బంది నియమ నిబంధనలను పాటించడం లేదు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వెబ్‌సైట్ 5 దాటిన తర్వాత కూడా పనిచేస్తుండడంతో ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమాలకు పాల్పడుతూ డబ్బు సంపాదిస్తున్నారు. ఇలాంటి తగ్గాలన్నా, ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నా ఏసీబీ, ఉన్నతాధికారులు నిఘాను పెంచాల్సిన అవశరం ఎంతైనా ఉంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి అంత స్పష్టంగా కనిపిస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. డాక్యుమెంట్ రైటర్లు సబ్‌రిజిస్ట్రార్లకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ తమ ఇష్టానికి డబ్బు వసూలు చేస్తున్నారు. కార్యాలయంలో నిత్యం 50 వరకు పలు భూములు, భవనాలు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. అదే సీజన్ అయితే రోజులో 200కుపైగా రిజిస్ట్రేషన్లు అయిన సందర్భాలు ఉన్నాయి.

- ప్రవీణ్, స్థానికుడు

ఆధార్ కేంద్రాలు లేక అవస్థలు

- ప్రతి పథకానికీ ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గజ్వేల్, ఫిబ్రవరి 3: ఆధార్ సెంటర్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గజ్వేల్‌తో పాటు జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్నా.. బ్యాంకులో ఖాతా తెరిచినా, ఇతర ఏ అవసరానికైనా ఆధార్ అవసరం. ఆధార్‌కు మొబైల్ నంబర్ లింకు తప్పనిసరి కావడంతో ప్రజలు సెంటర్ల వద్దకు క్యూ కడుతున్నారు. మీ సేవా కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ నిలిపివేయడంలో జనం పోస్టాఫీసులు, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. అయితే, పోస్టాఫీసుల్లో కేవలం రోజుకు 20 టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు. ఒకవేళ అంతకంటే ఎక్కువ మంది వస్తే తదుపరి రోజు రావాలంటూ సూచిస్తున్నారు. అవగాహన లేక మరికొందరు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం కోసం మీ సేవా కేంద్రాలు, ఇంటర్‌నెట్ సెంటర్లకు వెళ్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధార్ కేంద్రాలను పెంచాల్సిన అధికారులు మీసేవా కేంద్రాల్లో ఉన్న ఆధార్ కేంద్రాలను నెమ్మది నెమ్మదిగా ఎత్తివేస్తుండడంతో జనాలకు తిప్పలు తప్పడం లేదు. ఇక రోజువారీగా అప్‌డేట్ చేసిన ఆధార్‌లు సైతం రిజెక్ట్ అవుతుండడం గమనార్హం.

కేవైసీలకు క్యూ..

ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పలుమార్లు పత్రికల్లో, మీడియాలో వచ్చినా సిద్దిపేట జిల్లా అధికారుల్లో మాత్రం చలనం కలగడం లేదు. ప్రజల బాధను అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల రేషన్ కార్డు, గ్యాస్ కస్టమర్లు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉండడంతో పెద్దఎత్తున ప్రజలు సెంటర్ల వద్ద క్యూ కట్టారు. బయోమెట్రిక్, ఫోన్‌నంబర్ అప్‌డేట్, అడ్రస్ మార్పునకు తప్పనిసరిగా యూఐడీఏఐ ఆధార్ సెంటర్ల వద్ద చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ సెంటర్లు కేవలం బీఎస్‌ఎన్‌ఎల్, పోస్టాఫీసు, బ్యాంకులతో పాటు మండలానికి ఒకటి, రెండు మీసేవా కేంద్రాల్లోనే ఉన్నాయి. అయితే, యూఐడీఏఐ కేంద్రం పరిధిలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంతో మాట్లాడి ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.



గజ్వేల్‌లోని పోస్టాఫీస్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం క్యూలో నిల్చున్న ప్రజలు

ఉల్లి రైతుకు ఏదీ మద్దతు?

- నెల క్రితం కిలో రూ. 30.. ప్రస్తుతం రూ. 12 మాత్రమే
- పెట్టుబడి తిరిగి రావడమూ కష్టమేనంటున్న రైతులు



నారాయణఖేడ్, ఫిబ్రవరి 3: ఉల్లి రైతుకు మద్దతు కరువైంది. మార్కెట్‌లో ధర సగానికి పైగా పతనమైంది. లాభాలు ఆర్జించవచ్చని ఉల్లి పంట సాగు చేయగా.. పెట్టుబడి కూడా తిరిగివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నెల రోజుల క్రితం మార్కెట్‌లో క్వింటాలు ఉల్లి ధర రూ.3 వేలు ఉండగా.. ప్రస్తుతం క్వింటాలుకు రూ.1,200 నుంచి రూ.1,400 వరకు మాత్రమే పలుకుతున్నది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరానికి రూ. 70వేలు ఖర్చు

నారాయణఖేడ్ డివిజన్‌లో ఉల్లిపంట ఎక్కువగా సాగు చేస్తారు. ఎకరా విస్తీర్ణంలో ఉల్లిని పంటను సాగు చేయడానికి రూ. 60వేల నుంచి రూ. 70 వేల వరకు ఖర్చవుతుంది. గతేడాది ఎకరాకు 100 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర క్వింటాలుకు అత్యధికంగా రూ. 6వేల వరకు పలికింది. ఈసారి వాతావరణ మార్పుల కారణంగా దిగుబడి 70 నుంచి 80 క్వింటాళ్లకు మించడం లేదు. మరోవైపు ధర కూడా భారీగా పతనమవుతున్నది. నెల క్రితం వరకు మార్కెట్‌లో ఉల్లి గడ్డ క్వింటాలుకు రూ. 3వేల వరకు పలికింది. కానీ క్రమంగా ధరలు పతనమవుతూ ప్రస్తుతం ధర క్వింటాలుకు రూ. 1,200 నుంచి రూ. 1,400 మాత్రమే ధర పలుకుతున్నది.

నిల్వ చేసేందుకు వసతులు కరువు

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరకు ఉల్లి పంటను విక్రయిస్తే పెట్టుబడులకే సరిపోతుందని, తామెలా బతకాలని రైతులు వాపోతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు తగ్గిపోయాయని, ధర పెరిగే నిల్వ ఉంచడానికి సౌకర్యాలు లేవని రైతులు వాపోతున్నారు. స్థానికంగా ఉల్లిని నిల్వ ఉంచే పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు కూడా తక్కువ ధర చెల్లిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన పంటను వెంటనే పక్క రాష్ట్రాలకు తరలించి విక్రయిస్తున్నారు. లాభాలు ఆర్జించవచ్చని ఉల్లిగడ్డను సాగు చేస్తే ఖర్చులకే సరిపోతున్నదని రైతులు ఉసూరుమంటున్నారు.

పెట్టుబడికే సరిపోతున్నది



ఎకరం పావు పొలంలో ఉల్లి పంటను సాగు చేశాను. పెట్టుబడి రూ.80 వేల వరకు ఖర్చు చేశాను. 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట చేతికి వచ్చిన తరుణంలో ధర పడిపోవడంతో పెట్టుబడికే సరిపోతున్నది.

- కిషన్, నారాయణఖేడ్

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి

● తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్



సదస్సులో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

చేర్యాల, ఫిబ్రవరి 3: మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ పేర్కొన్నారు. ప్రకృతి పర్యావరణసంస్థ ఆధ్వర్యంలో శనివారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మత్స్యకారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడం ద్వారా దళారీవ్యవస్థను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు, వ్యవసాయ, చేపల ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుతాయన్నారు. ప్రతీ మత్స్యకారుడు సంఘంలో వాటాదారుడిగా చేరాలని, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈవో మూగ జయశ్రీ పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస భిక్షపతి, చేర్యాల ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మత్స్యకార సంఘాల ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నారదాసు ఈశ్వర్, ప్రతినిధులు తిరుపతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 3: సిద్దిపేట ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గ్రామీణ ప్రతిష్ఠ తెలంగాణ రాష్ట్ర సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు శనివారం జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు ముఖ్య అతిథులుగా హాజరైన ఇందిరానగర్ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి పరీక్ష బ్రోచర్‌ను, సెట్ పేపర్లు విడుదల చేశారు. ఇటీవల జిల్లాలోని 26 మండలాల్లో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన జడ్పీ, కస్తూర్బా మోడల్‌స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో జిల్లాస్థాయి ఇంగ్లిష్ మీడియంలో మొదటి స్థానం కోహెడ జడ్పీఎస్ఎస్ విద్యార్థి అంజనాదేవి, ద్వితీయస్థానం నారాయణరావుపేట విద్యార్థి నిహారిక, తృతీయస్థానం కోహెడ జడ్పీఎస్ఎస్ విద్యార్థి శ్వేత, తెలుగు మీడియంలో చీకోడ్ జడ్పీఎస్ఎస్‌కు చెందిన అక్షిత ప్రథమస్థానం, గురువన్నపేట జడ్పీఎస్ఎస్‌కు చెందిన నవ్య ద్వితీయ, పాములపర్తి జడ్పీఎస్ఎస్‌కు చెందిన సాయిప్రియ, చింతమడక జడ్పీఎస్ఎస్‌కు చెందిన లోహిత్ తృతీయస్థానం దక్కించుకున్నారు. అనంతరం విజేతలకు ఇందిరానగర్‌స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజప్రభాకర్‌రెడ్డి, జిల్లా సోషల్ ఫోరం నాయకులు మెమొంటో, సర్టిఫికెట్లు అందజేశారు. విజేతలు ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టాలెంట్‌టెస్ట్‌కు హాజరవుతారని తెలిపారు.


ప్రతిభాపాటవ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ
● వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాతీయరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్/సిద్దిపేట అగ్రికల్చర్ ఫిబ్రవరి 3 : ప్రత్యేకాధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని రాష్ట్ర పంచాతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి స్పెషలాఫీసర్ల పాలన ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు అంకితభావంతో పనిచేస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రత్యేకాధికారులకు వారి అధికారాలు, బాధ్యతల గురించి ఒక రోజు శిక్షణను అందించి అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమవర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సీతక్క తెలియజేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, యువత, మహిళలు, ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. జాతరలు ఉన్న ప్రాంతాల్లో పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధికారులను ఆదేశించారు. జాతరలు జరిగే రెండు రోజుల ముందు నుంచే పెద్దఎత్తున ప్రచారం చేయాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థాల నిరోధానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగియడంతో 2 నుంచి ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకొని పాలన సాగిస్తున్నారన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా కార్యాచరణ రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా ముందుకెళుతున్నట్లు వివరించారు. ప్రతీ కుటుంబానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ జిల్లాలోని 647 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించామని, ఆయా అధికారులు విధుల్లో చేరారన్నారు. వారికి విధులు, బాధ్యతలపై శిక్షణ అందించామని మంత్రికి తెలిపారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని విధాల ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రత్యేకాధికారులకు దిశానిర్దేశం చేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించేలా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రికి కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేష్, డీపీవో సాయిబాబా, డీఆర్డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి నుంచి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సురేష్‌మోహన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జడ్పీ సీఈవో రమేష్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్పీ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పుల్‌కల్, ఫిబ్రవరి 3: రాత్రి స్నేహితులతో కలిసి మద్యం తాగి.. తెల్లవారేసరికి శవమై కనిపించాడు ఓ యువకుడు. ఈ ఘటనకు సంబంధించి జోగిపేట సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాకు చెందిన మూడ్ ప్రవీణ్(27) అదే తండాకు చెందిన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం రాత్రి స్థానిక బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేసి తాగారు. శనివారం ఉదయం వరకు ప్రవీణ్ ఇంటికి రాకపోవడంతో కుటుబసభ్యులు వెతకగా అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న వారి పొలం వద్ద శవమై కనిపించాడు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. ప్రవీణ్‌ను హత్య చేశారంటూ కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. జోగిపేట సీఐ నాగరాజు, పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహిస్తేనే అన్ని నిజాలు తెలుస్తాయని, సహకరించాలని కోరడంతో శాంతించారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆనవాళ్లను సేకరించారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి మృతదేహన్ని తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. తండాకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ప్రవీణ్‌కు ఇద్దరు భార్యలు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రమేష్ మృతదేహం

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 3 : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దశంకరంపేటలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన కడమంచి రమేష్(20) తాగిన మైకంలో గడికోట శివారులో ఉన్న కిరాణం దుకాణంపైకి ఎక్కాడు. విద్యుత్ వైర్లు తగిలి కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం విషయం తెలయడంతో ఎస్ఐ బాలరాజు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కడమంచి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రషర్‌లో ప్రమాదం.. ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కంది, ఫిబ్రవరి 3 : కంది మండల పరిధి ఎర్దనూర్ శివారులోని ఓ స్టోన్ క్రషర్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్దనూర్ తండాకు చెందిన భీముడునాయక్ గ్రామ శివారులోని ఓ క్రషర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం క్రషర్‌లో బ్లాస్టింగ్ జరుగున్న సమయంలో కొన్ని రాళ్లు ఎగిరిపడ్డాయి. అందులో ఓ రాయి భీముడుకుడి చేతికి బలంగా తలగడంతో చెయ్యి నుజ్జునుజ్జయ్యింది. గ్రామస్థులు వెంటనే అతన్ని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో భీముడిని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పరామర్శించారు. అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, అలాగే ప్రమాదానికి కారణమైన క్రషర్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లక్డారంలో క్రషర్ సీజ్


క్రషర్‌ను సీజ్ చేసిన అధికారులు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 3 : లక్డారంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం సంతోష్ క్రషర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ క్రషర్లపై విచారణ కొనసాగుతుందని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అన్ని క్రషర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 35 తులాల బంగారం మాయం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 3 : తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 35 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన సిద్దిపేట పట్టణంలో శనివారం వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని మహాశక్తినగర్‌కు చెందిన సుమన్ ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సుమన్ ఫిబ్రవరి 1వతేదీన ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో సహా కామారెడ్డికి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి శుక్రవారం సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లాకర్‌లో ఉన్న 35 తులాల బంగారం పోయినట్లు గుర్తించాడు. సుమన్ వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలను సేకరించారు. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

సిలిండర్ నుంచి మంటలు.. తప్పిన ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చేగుంట, ఫిబ్రవరి 3 : నార్సింగి మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఓ పూరిగుడిసెలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో గువ్వలేగి భిక్షపతి నివాస పూరిగుడిసెలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వచ్చాయి. వెంటనే ఎస్ఐ అహ్మద్, రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలాన్ని చేరుకుని గ్యాస్ సిలిండర్ నుంచి వెలువడిన మంటలు ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు పదివేల వరకు ఆస్తి నష్టం జరిగింది. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

పాడైపోయిన తినుబండారాలు.. ఫ్రిజ్‌లో బొద్దింకలు

● నారాయణఖేడ్ పట్టణంలోని బేకరీల్లో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీ


బేకరీలోని పాడైన ఆహారపదార్థాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 3: నారాయణఖేడ్ పట్టణంలోని పలు బేకరీల్లో శనివారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకరీల్లో పాడైపోయిన తినుబండారాలు, ఫ్రిజ్‌లోని కేక్‌లలో బొద్దింకలు కనిపించాయి. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పట్టణంలోని ఓ బేకరీలో, స్వీట్ హౌస్‌లో తనిఖీలు చేయగా వంటకాలు తయారు చేసే హౌస్‌లలో అపరిశుభ్రమైన వాతావరణం, చెడిపోయిన ఆహారపదార్థాలు కనిపించాయి. బేకరీలోని ఫ్రిజ్‌లో బొద్దింకలున్నాయి. చెడిపోయిన కేక్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బేకరీల్లోని ఆహార పదార్థాలపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై కమిషనర్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. దీంతో కేక్ వరల్డ్ బేకరీ యజమానికి రూ.5 వేలు, స్వీట్ హౌస్ యజమానికి రూ.1000 జరిమాన విధించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపిస్తామన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు.

ప్రత్యేకాధికారులు బాధ్యతగా పనిచేయాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 : గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు బాధ్యతగా పనిచేయాలని, గ్రామ పాలనకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శనివారం ప్రత్యేకాధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె విధుల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు కొత్త పనిని భారంగా భావించకుండా సంతోషంగా చేయాలని సూచించారు. విధుల్లో భాగంగా గ్రామాల్లో సందర్శించి పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా పారిశుధ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ మరుగుదొడ్లను శుభ్రం చేయించాల్సిన బాధ్యత పంచాయతీలదేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో పొడి చెత్త అమ్మకం ద్వారా నిధులు సమకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. మార్చి 31లోగా వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకాధికారి సందర్శించి మౌలిక వసతులను పరిశీలించి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, డీపీవో సురేష్‌మోహన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధిలోకి

విద్యతోనే అన్ని రకాలుగా అభివృద్ధిలోకి వస్తామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు ప్రిన్స్ పైప్స్ పరిశ్రమ వారి సహకారంతో, మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి విద్యా అత్యంత ప్రాధాన్యమైనదని, అందులో అమ్మాయిలకు మరీ ముఖ్యమన్నారు. ఓ లక్ష్యంతో ముందుకు సాగాలని, ఆశయం నెరవేరేలా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు బాసటగా నిలిచిన పరిశ్రమ యాజమాన్యం, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఏడు పాఠశాలల్లో 50 మంది పదో తరగతి విద్యార్థులకు గుర్తించి వారికి రూ.5 లక్షల విలువ చేసే చెక్కు, 8, 9వ తరగతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, కిట్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఎంఈవో వెంటన ర్సింలుగౌడ్, ప్రిన్స్ పైప్స్ పరిశ్రమ యాజమాన్యం, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌కు సంబంధించి చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి

ప్రజలకు చేసిన సేవలే గుర్తింపు తెస్తాయి

● దక్షిణమధ్య రైల్వేబోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్

జహీరాబాద్, ఫిబ్రవరి 3 : గ్రామాల్లో ప్రజలకు చేసిన సేవలు, చేపట్టిన అభివృద్ధి పనులు గుర్తింపు తీసుకొస్తాయని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్ అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో శనివారం మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో పలువురు సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పదవిలో ఉన్నప్పుడు ప్రజలతో మమేకంగా ఉండడం, చేపట్టిన పనులు, పలుకరింపులు, ప్రజల పట్ల ఆప్యాయతగా నడుచుకున్న తీరు తదితరాలు గుర్తింపు తెచ్చి పెడుతాయన్నారు. పదవులు శాశ్వతం కాదనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. గ్రామాల్లో ప్రజలతో నాయకులు కలిసిమెలిసి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతు తాత్కాలికంగా లభించే పదవుల వ్యామోహంలో పడి ప్రజలకు సేవచేయడాన్ని నాయకులు మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి ఎంపీడీవో మహేష్, చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్, తాజా మాజీ సర్పంచులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.


సర్పంచ్‌ను సన్మానిస్తున్న షేక్‌ఫరీద్

ఏడుపాయల జాతర ఏర్పాట్ల ఊసేది?

● ఇంకా సమీక్ష సమావేశమే నిర్వహించలేదు
● ప్రతీసారి ఆలస్యంగా పనులు

పాపన్నపేట, ఫిబ్రవరి 2 : ఏడుపాయల వనదుర్గామాత జాతరకు ప్రతీ ఏటా ఆలస్యంగా ఏర్పాట్లను ప్రారంభించడం, అరకొర పనులనే చేపట్టడం జరుగుతుంది. ఈసారి ఇదే తంతు కొనసాగేలా ఉంది. ముందస్తుగా సమీక్ష సమావేశాన్ని కూడా నిర్వహించడం లేదు. ఈ నెల9న మాఘ అమావాస్య, మార్చి 9న మహాశివరాత్రి పర్వదినం ఉన్నప్పటికీ ఏడుపాయల జాతర ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తుంది. మహాశివరాత్రి వేళ ఏడుపాయల వనదుర్గమ్మ జాతర ప్రారంభమవుతుంది. వారం రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో కన్నులపండువగా జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి రూ.కోటి వరకు నిధులను వెచ్చిస్తున్నారు కానీ భక్తులకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదు. అయితే జాతరకు 15 రోజుల ముందే పనులను ప్రారంభించడం, ఆ పనులను నామమాత్రంగా చేసి చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారింది. తీరా చూస్తే జాతరకు అదనంగా మరో రూ.కోటి ఖర్చు అయినట్లు లెక్కలు ఉంటాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కన్న అమ్మవారికి వచ్చే ఆదాయం ఎక్కువగా ఉన్న, పక్కా ప్రణాళికతో జాతర కార్యక్రమాలను చేయడం లేదని భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైన జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లను ముందే నుంచే చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నామినేట్ చేయబడ్డ పాలకవర్గం ఈ ఏడు జాతరపైన ప్రత్యేకంగా దృష్టి సారించలేక పోతుంది. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ చూపితే తప్ప జాతర పనుల్లో వేగం అందుకోదు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

● కలుషిత ఆహారం తినడంతో..

చేగుంట, ఫిబ్రవరి 3 : పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు తిన్న ఆహారంతో ఐదుగురు అస్వస్థతకు గురైన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని బి.కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. బి.కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఉదయం 11 గంటల సమయంలో వాంతులు చేసుకున్నారు. వెంటనే స్పందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లం 108 అంబులెన్స్‌లో విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్, నిఖిల్, ప్రణయ్, కిరణ్‌ను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి అజిత్‌కుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో కారణాలపై వాకబు చేశారు. గ్రామంలో శుక్రవారం సంత కావడంతో సాయంత్రం వేళ పానిపూరి, కట్లిస్ బండిపై తినుబండారాలను తిన్నారని, కలుషిత ఆహారంతో ఫుడ్‌పాయిజన్ అయి విద్యార్థులకు వాంతులైనట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విషయం తెలుసుకున్న చేగుంట తహసీల్దార్ గియా ఉన్నిసా బేగం, ఎస్ఐ హరీష్‌గౌడ్, కొండాపూర్ గ్రామానికి చేరుకుని పాఠశాలలో విద్యార్థుల అస్వస్థత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.


అస్వస్థతకు గురైన విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

సోషల్ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్రస్థాయికి 9 మంది ఎంపిక


సోషల్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 3: తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయికి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింలు తెలిపారు. తెలుగు మీడియం నుంచి 63 మంది, ఇంగ్లిష్ మీడియం నుంచి 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎంపికైన వారిలో తెలుగు మీడియం నుంచి ప్రథమ విష్ణువర్ధిన్(జడ్పీహెచ్ఎస్ మనోహరాబాద్), ద్వితీయ అనుష్క(జడ్పీహెస్ఎస్ రామాయంపేట), తృతీయ సుధీష్ణ(జడ్పీహెచ్ఎస్ నస్కల్), ఇంగ్లిష్ మీడియం నుంచి ప్రథమ సుమంత్(ఎంజేపీ బాయ్స్ హెచ్‌ఘణపూర్), ద్వితీయ వినయశ్రీ(జడ్పీహెచ్ఎస్, తూప్రాన్), తృతీయ సృజన్(ఎంజేపీ బాయ్స్ హెచ్‌ఘణపూర్), ప్రైవేటు స్కూల్స్ విభాగం నుంచి ప్రథమ సాయిచరణ్(శంకర స్కూల్ నిజాంపేట), ద్వితీయ శ్రీప్రియ(గీతా చేగుంట), తృతీయ సోహన్ దీప్‌సింగ్(సత్యం విద్యా మందిర్, శివ్వంపేట) ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోటీ పరీక్షలకు సోషల్ సబ్జెక్ట్ తప్పనిసరి అన్నారు. ఈ సబ్జెక్టు ద్వారానే జాతీయ భావాలు, నైతికవిలువలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, డైట్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, హెచ్‌ఎం రేఖ, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంచండి

● కష్టపడి కాదు.. ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలి
● రచయిత యండమూరి వీరేంద్రనాథ్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 3 : విద్యార్థులను పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంచి, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలని రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. శనివారం నందిగామ రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. విద్యార్థులను మొబైల్‌కు దూరంగా ఉంచాలని, వాటితో చాలామంది విద్యార్థులు మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా విద్యార్థులను ప్రోత్సహించేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల కారణంగా బాల్యం నుంచే బంధుత్వాలకు దూరమవుతున్నారని, నాయనమ్మ, తాతయ్యతో కూడా సఖ్యత లేకుండా పెరుగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ రెండేళ్లుగా రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అకడమిక్, హోలిస్టిక్ ఎడ్యుకేషన్‌లో ఒక వెలుగు వెలిగిందన్నారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యండమూరి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, ఎంఈవో పీపీ రాథోడ్, బానూర్ సీఐ రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అతిథులుగా అభిజ్ఞ, మిస్ పర్ఫెక్ట్ మూవీ టీమ్ సభ్యులు హాజరయ్యారు.


విద్యార్థినిని అభినందిస్తున్న యండమూరి వీరేంద్రనాథ్

జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

తూప్రాన్, ఫిబ్రవరి 3 : తూప్రాన్ సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాలలో 9వ అంతర్ జిల్లాల జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలను నిర్వహించారు. హాజరై మాట్లాడారు. ఈ పోటీలో మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ జట్లు లీగ్ దశలో ఉత్తమ ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ముఖ్యఅతిథిగా హాజరైనర మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినోద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, అభిషేక్ గౌడ్, ప్రధాన కార్యదర్శినవీన్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వహణ కార్యదర్శి రమేష్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్న కేటీఆర్

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ధ్వజం

నర్సాపూర్, ఫిబ్రవరి 3: ప్రభుత్వం కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకార పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులుగౌడ్ అన్నారు. శనివారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాలేదని, అప్పుడే బీఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. పదవులు లేకుండా ఆ పార్టీ నేతలు ఉండలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడాన్ని జీర్ణించుకోలేక అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌కు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి తప్పదని, ఆ తర్వాత ఆపార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

నేడు బీజేపీ 'మెదక్' సన్నాహక సమావేశం

మనోహరాబాద్, ఫిబ్రవరి 3 : భారతీయ జనతా పార్టీ మెదక్ పార్లమెంట్ పరిధిలోని శక్తి ప్రముఖులు, బీజేపీ మండల అధ్యక్షులు, ఆపైస్థాయి నాయకుల సమావేశం ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని దండుపల్లి వద్ద ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు మెదక్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కోహూరు సంగమేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి పల్వాయి హరీష్ బాబు, దుబ్బాక మాజీ ఏమ్మెల్యే రఘునందన్‌రావు హాజరవనున్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

జోగిపేట, ఫిబ్రవరి3: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు కేంద్రాల్లో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు మెదక్ వెస్ట్ రీజయన్ ఆర్‌సీవో భీమయ్య తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అందోలు, రంజోల్, చిట్కుల్, కొండాపూర్, ఇస్నాపూర్, హత్నూర కాలేజీ, హత్నూర స్కూల్, మెదక్, రామాయంపేట, కొల్చారం, తూప్రాన్‌లో 11 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షను నిర్వహించనున్నామన్నారు. ఒక్కో సెంటర్‌లో 480 మంది చొప్పున విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయనున్నట్టు భీమయ్య వివరించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని భీమయ్య సూచించారు.

12న సైన్స్ దినోత్సవ పోటీలు

సిద్దిపేట క్రైం ఫిబ్రవరి 3: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12న తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (టీఎస్ కాస్ట్), పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధనాసంస్థలో జాతీయ సైన్స్ దినోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఈ నెల 12న పోటీలను నిర్వహించనున్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం విజ్ఞానశాస్త్రం అనే ప్రధాన అంశంగా వ్యర్థాన్ని తగ్గించు, ఈ వ్యర్థాన్ని తగ్గించు, ఆరోగ్యకరమైన జీవన విధానాలు అనుసరించు, సుస్థిర ఆహార వ్యవస్థలను అనుసరించు, ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పు, నీటిని సంరక్షించు, ఇంధనాన్ని సంరక్షించు అనే ఉపాంశాలపై పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. చిత్రలేఖనం, కవిత్వం, పాటలు, ఉపన్యాసం విభాగాల్లో పోటీలను నిర్వహిస్తారు. మొదట ఈ పోటీలను జిల్లాస్థాయిలో నిర్వహిస్తారు, ప్రతీ జిల్లా నుంచి ఆయా విభాగాల్లో ముగ్గురేసి చొప్పున విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ ఈ నెల 12 వరకు పూర్తి కావాలని తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయిలో టీఎస్ కాస్ట్ ఈపీటీఆర్ఐ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి విజేతలకు ఈ నెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్‌అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ (9849699382)ను సంప్రదించాలని సూచించారు.

గంగాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 3: సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సురభి మెడికల్ కళాశాల మిట్టపల్లివారి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు హాస్పిటల్ పీఆర్‌వో పరశురాములు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లింగారెడ్డి, బాబు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల, ఫిబ్రవరి 3 : పట్టణ ప్రగతి నిధులు రూ.5లక్షల వ్యయంతో చేర్యాల మునిసిపల్ 1వవార్డులో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులను శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'కు మార్చాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుంచి 'ఏ' గ్రూపునకు మార్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డిలో ముదిరాజ్ సంఘం సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో మారుస్తామని చెప్పి మళ్లీ బీసీ'డీ' గ్రూపులోనే ఉంచారని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణనను నిర్వహించి ముదిరాజ్‌లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో సముచిత స్థానంలో ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ముదిరాజ్‌లతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమంలో చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు విద్యాసాగర్, శివకుమార్, భైరయ్య, నాగభూషణం, కనకరాజు, రామచంద్రం, తదితరులున్నారు.

సర్పంచ్, హెచ్‌ఎంకు ఆత్మీయ వీడ్కోలు

కోహెడ ఫిబ్రవరి 3: మండలంలోని శనిగరం గ్రామ మాజీ సర్పంచ్ కర్ర జయశ్రీ రవీందర్‌తో పాటు బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు ఎం మరుద్విదేవికి శనివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలను అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు తొగిటి సత్యనారాయణ, స్వప్న శశిధర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, బాల్‌రెడ్డి, సమ్మయ్య శైలజ తదితరులు పాల్గొన్నారు.

అవునండి.. ఇవి రోడ్లే..!

- రూ. 22 కోట్లకు పైగా వెచ్చించి పనులు
- ఏడాది తిరగకముందే పగుళ్లు.. కంకర



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో సీసీ రోడ్డుపై పగుళ్లు, రాజిరెడ్డిపల్లి కుంట రోడ్డుపై తేలిన కంకర

గజ్వేల్, ఫిబ్రవరి 3: గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బురద, మట్టి రోడ్డు లేకుండా గత ప్రభుత్వం రోడ్ల కోసం రూ. 22.87 కోట్లు మంజూరు చేసింది. అధికారులు... ప్రజాప్రతినిధులు హంగు, ఆర్భాటంతో గతేడాది ఈ పనులను చేపట్టి పూర్తి చేయించి.. మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల రూపురేఖలు మార్చేశామని గొప్పలు చెప్పుకున్నారు. అయితే, ఆ పనులన్నీ మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. అధికారుల అత్యుత్సాహం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి నిధులన్నీ నీళ్లపాలయ్యాయి. ఈ మున్సిపాలిటీ పరిధిలో రూ. కోట్లు వెచ్చించి వేసిన రోడ్లలో కొన్ని ఏడాది లోపే కంకర తేలి, బీటలు వారి, పగుళ్లు కనబడుతున్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనులు చేసి.. బిల్లులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పనులు చేపట్టిన పలువురు కాంట్రాక్టర్లకు అప్పటి పెద్దలతో నేరుగా సంబంధాలు ఉండటంతో అధికారులూ చేసేదేమీ లేక మిన్నకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ పర్సంటేజీ తమకిస్తే చాలు.. పనులు ఎలా జరుతున్నా పట్టించుకోం అన్న తరహాలో అధికారులు వ్యవహరించడంతో ప్రజాధనం వృథా అయినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవిగో పనులు..

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సీసీ రోడ్లలో బీసీ కాలనీ, గ్యాస్ గోదాంకు వెళ్లే మెయిన్ రోడ్డు పరిస్థితి బాగానే ఉండగా, అక్కడి నుంచి పాత ఆదర్శ పాఠశాల వరకు వెళ్లే రోడ్డు పగుళ్లు వచ్చాయి. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే హైటెన్షన్ లైన్ స్తంభాన్ని మధ్యలో ఉంచి రోడ్డు వేశారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు. రాజీవ్ పార్కు వద్ద నుంచి రాజిరెడ్డిపల్లికి వెళ్లే పార్కికుంట రోడ్డు పరిస్థితీ దాదాపు అంతే ఉంది. ఇక 11వ వార్డులోనూ ఇదే తరహాలో రోడ్ల నిర్మాణం చేపట్టారు.

ఎల్లారెడ్డిపేట పాఠశాలలో 'స్వయం పాలన'



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తొగుట, ఫిబ్రవరి 3: మండలంలోని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఈవోగా జ్యోతిర్మయి, ఎంఈవోగా రిత్విక్, హెడ్ మాస్టర్‌గా రక్షిత, ఉపాధ్యాయులుగా పవన్, కార్తీక్, శ్రీనివాస్, ఫర్హానా, శ్రీవల్లి, మధులత, రేణుక, మనోజ్ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు, ఉపాధ్యాయులు మంజుల, శ్రీలత, రాంచంద్రారెడ్డి, ఉపేందర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

యాసంగికి నీటి కష్టాలు తీరినట్టే



నిండు కుండలా పోలవేణి కుంట

మత్తడి అలుగు పారుతున్న దృశ్యం

నారాయణరావుపేట, ఫిబ్రవరి 3: రంగనాయక సాగర్ ఎడమ కాలువ నుంచి నీరు రావడంతో యాసంగి పంటలకు నీటి కష్టాలు తీరినట్లేనని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా రంగనాయక సాగర్ నుంచి కాలువల ద్వారా వస్తున్న నీటితో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పోలవేణి కుంట నిండు కుండలా మారి మత్తడి అలుగు పారుతున్నది. పోలవేణి కుంట దిగువ భాగంలో ఉన్న తుంగ చెరువు, చెక్ డ్యాంలు నిండిన తర్వాత నక్కవాగు మాటిండ్ల కొత్తచెరువులోకి నీళ్లు చేరుకుంటాయి. పోలవేణి కుంట నిండి దిగువకు నీళ్లు రావడంతో ఆయకట్టు రైతులు యాసంగి పంటకు నీరు సరిపడా వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విందు .. వివాదం

- మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది బాహాబాహీ
- పోలీసులకు పరస్పర ఫిర్యాదులు

చేర్యాల, ఫిబ్రవరి 3: కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో సమావేశమైన విషయంలో ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బంది బాహాబాహీకి దిగారు. ఈ సంఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడంతో వివాదాస్పదంగా మారింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పునరుద్ధరణ కమిటీ సభ్యుల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తడంతో పాటు మరికొంత కాలం కొనసాగనున్న జాతరలో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సమావేశమయ్యారు. ఆయా అంశాలపై చర్చించిన అనంతరం గ్రామశివారులోని ఓ ఇంట్లో విందు ఏర్పాటు చేసుకున్నారు. ఓ సభ్యుడికి సహాయకులుగా ఉన్న ఇరువురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది విందు సహాయక చర్యలలో నిమగ్నమయ్యారు. ఇంతలో గతంలో వలంటీర్లుగా పని చేసినవారితో పాటు పలువురు అక్కడికి చేరుకొని పునరుద్ధరణ కమిటీసభ్యుల విందు ఫొటోలు, వీడియో రికార్డింగ్ చేసేందుకు యత్నించారన్న విషయమై గొడవ పడ్డారు. దీంతో ఒకరిపై మరొకరు చేయిచేసుకున్నారు. ఇది గమనించిన పలువురు సభ్యులు బయటకు వచ్చి ఇరువర్గాలవారిని వారించి పంపించివేశారు. కొద్దిసేపటి తరువాత ఇరువర్గాలవారు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు తెలిపారు. కాగా శనివారం ఫిర్యాదుల ఉపసంహరణకు రాజీ కుదుర్చుకునే ప్రయత్నాలు కొనసాగించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆలయంలో అవినీతికి పాల్పడిన వారితో పాటు అవకతవకలకు పాల్పడిన వలంటీర్లను తొలగించామన్న అక్కసుతోనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్యాటకం లక్ష్మారెడ్డి ఆరోపించారు. కొమురవెల్లిలో ఎలాంటి విందు నిర్వహించలేదని స్పష్టం చేశారు.

ఆలయ పవిత్రతకు భంగం: సీపీఎం

మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ ఆలయ పవిత్రతను దెబ్బతీస్తుందని, చైర్మన్ లక్ష్మారెడ్డితో పాటు సభ్యులు కొమురవెల్లిలో విందు ఏర్పాటు చేసుకోవడం తగదని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విందులపై ఉన్న శ్రద్ధ భక్తులకు వసతుల కల్పనపై లేకపోవడం సిగ్గుచేటన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 3: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలు, వ్యాపారులు, వాహనదారులకు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు పాటిస్తూ సేఫ్టీగా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి మాత్రమే జరిమానాలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వినయ్ సాగర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు



సిద్దిపేట కాంగ్రెస్ నాయకులతో మైనంపల్లి హనుమంతరావు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి3: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ ఈ నెల 6న సిద్దిపేట నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మైనంపల్లి హనుమంతరావు హాజరవుతారని, సమావేశానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. పార్లమెంట్ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, నాయకులు గయాజుద్దీన్, గ్యాదరి మధు, రాశాద్, మజార్ మాలిక్, అయ్యుబ్, సోహెల్, సాహిల్, బొమ్మల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గాలకు ఘనంగా సన్మానం



మద్దూరు: సర్పంచ్, పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు



హుస్నాబాద్ మండలం వంగరామయ్యపల్లి గ్రామంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సన్మానం

మద్దూరు, ఫిబ్రవరి 3: ఐదేళ్లుగా గ్రామాభివృద్ధి కోసం నిరంతర సేవలందించిన సర్పంచ్ కంతారెడ్డి జనార్దన్ రెడ్డి సేవలు అభినందనీయమని గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ కొనియాడారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ పాలకవర్గం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కంతారెడ్డి జనార్దన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆరీఫ్‌తో పాటు వార్డు సభ్యులను హెచ్ఎం శ్రీశైలం, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వంగరామయ్యపల్లిలో..

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 3: మండలంలో కొత్తగా ఏర్పడిన వంగరామయ్యపల్లి గ్రామాభివృద్ధికి ఐదేళ్లపాటు నిరంతర కృషి చేసిన గ్రామ పంచాయతీ సర్పంచ్ వంగ విజయలక్ష్మి, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

చేర్యాలలో ముందస్తుగా జాతర సందడి



జాతర కోసం ఇంటిల్లిపాది బెల్లం తీసుకువెళ్తున్న దృశ్యం

చేర్యాల, ఫిబ్రవరి 3: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభానికి కొద్దిరోజుల ముందే చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని గ్రామాల్లో సందడి మొదలైంది. అమ్మవార్ల చెంతకు వెళ్లి మొక్కులు తీర్చుకునేందుకు అప్పుడే సన్నద్ధమవుతున్నారు. తమ కోరికలు ఈడేరాలని వేడుకుంటూ నిలువెత్తు బంగారం సమర్పించేందుకు ఇంటిల్లిపాది బెల్లం కొనుగోళ్లు చేస్తున్నారు. ప్రజలు ముందస్తుగా అమ్మవార్ల దర్శనార్థం తరలివెళ్తుండటంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది.

మెదక్‌లో కాషాయజెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి

తొగుట, ఫిబ్రవరి 3: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్‌లో కాషాయ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన తొగుటలో 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు కుటుంబపాలన సాగించారే తప్ప బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్, గావ్ చలో.. బస్తీ చలో మండల కన్వీనర్ ఐలిగొండ చంద్రశేఖర్‌గౌడ్, కో కన్వీనర్ కళ్యాణ్‌దాస్ ముదిరాజ్, వెంకట్రావ్‌పేట ఎంపీటీసీ సభ్యుడు కంకణాల నర్సింహులు ముదిరాజ్, నాయకులు బొడ్డు నర్సింహులు యాదవ్, నంట స్వామిరెడ్డి, మల్లుగారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కడారి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ స్థానానికి టీపీసీసీ అధికార ప్రతినిధి దరఖాస్తు



గాంధీభవన్‌లో దరఖాస్తును అందజేస్తున్న బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని ఇవ్వాలని గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు గాంధీభవన్‌లో శనివారం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెదక్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

వర్గల్, ఫిబ్రవరి 3: రాజీవ్ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గౌరారం పోలీసులు శనివారం పట్టుకున్నారు. గౌరారం ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలో ఇసుక లోడ్ చేసుకుని రాజీవ్ రహదారి గుండా హైదరాబాద్ వైపు వెళ్తుండగా మండలంలోని గౌరారం సమీపంలోని వర్గల్ కమాన్ వద్ద పోలీసులు లారీని తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా లారీలో సుమారు 35 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండారెడ్డిపల్లిలో క్రీడా పోటీలు ప్రారంభం

కోహెడ, ఫిబ్రవరి 3: సుతారి రాములు స్మారక క్రీడాపోటీలను మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో ఎంపీటీసీ సుతారి కళ్యాణి శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకుడు మాజీ సర్పంచ్ కనుకయ్య తెలిపారు. విన్నర్ జట్టుకు రూ. 7 వేలు, రన్నర్ జట్టుకు రూ. 3,500 నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



స్వామి (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 3: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన గజ్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం గజ్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలోని పొలాల వద్ద గుర్తు తెలియని మృతదేహం పడిఉన్నట్టు రైతుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ సైదా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాల గురించి ఆరా తీశారు. మండలంలోని జాలిగామ గ్రామానికి చెందిన గుడిసె స్వామి(25) మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సమీపంలో లభించిన మద్యం బాటిళ్లను బట్టి అతిగా మద్యం సేవించి మృతి చెందిఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కాగా స్వామి కొంత కాలం క్రితం ఉపాధి కోసం హైదరాబాదు వెళ్లి టైల్స్ వేసే పని చేస్తు కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువ రైతు అదృశ్యం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 3: అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువరైతు రెండు రోజుల క్రితం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ భువనేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు మైసిగల్ల రమేష్(30) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ నెల 2న కూరగాయలను విక్రయించే నిమిత్తం హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి రైతు బజార్‌కు వెళ్లాడు. అతడు సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే పెట్టి వెళ్లడంతో బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. రెండు రోజులుగా తన భర్త కనిపించడం లేదంటూ భార్య శనివారం అక్బర్‌పేట-భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళను బెదిరించి దాడి.. కేసు నమోదు

అక్కన్నపేట, జనవరి 3: భూతగాదా కేసులో ఓ మహిళను బెదిరించి ఇంటి తలుపులను ధ్వంసం చేసినవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్యకు, అదే గ్రామానికి చెందిన ఎగ్గిడి రాజవ్వ కుటుంబాల మధ్య కొంతకాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో గొడవలు జరగడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా తమపై పెట్టిన కేసులు విత్ డ్రా చేసుకోవాలని మంగళవారం రాత్రి ఐలయ్య, రమేష్ నానా దుర్భాషలాడుతూ రాజవ్వ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడగా తలుపులు ధ్వంసమయ్యాయి. ఐలయ్య కుటుంబంతో తమకు ప్రాణహాని ఉందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

దుబ్బాక, ఫిబ్రవరి 3: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో దొంగలు తాళం వేసిన రెండిళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. శనివారం దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విభూదిసాయికృష్ణ, మర్కంటి అంజయ్య తమ ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇళ్లకు వేసిన తాళాలను ధ్వంసం చేసి రూ. 21వేల నగదుతోపాటు ఒక తులం బంగారం, వెండి ఎత్తుకెళ్లినట్టు బాధితులు వాపోయారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు వెంటనే వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

పోగొట్టుకున్న పర్సును అందజేసిన డీఎం

గజ్వేల్, ఫిబ్రవరి 3: పోగొట్టుకున్న పర్సును బాధితురాలికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ అందజేశారు. చేగుంట మండలం మక్కరాజుపేట గ్రామానికి చెందిన చంద్రకళ జేబీఎస్ నుంచి ప్రజ్ఞాపూర్‌కు శుక్రవారం ప్రయాణించింది. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్‌లో తన పర్సును పోగొట్టుకుంది. ఆ పర్సు ఆర్టీసీ కంట్రోలర్ ఆర్.ప్రతాప్‌రెడ్డికి లభించగా, పర్సులో ఉన్న మెడికల్ బిల్స్ ఆధారంగా సదరు మహిళను గుర్తించి ఫోన్ ద్వారా ఆమెను రప్పించారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పర్సును అందజేశారు.



బాధితురాలికి పర్సును అందజేస్తున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్

దళితబంధు పేరిట తీసుకున్న డబ్బులను చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 3: దళితబంధు పేరిట చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల్లో దళితుల నుంచి అక్రమంగా వసూలు చేసిన డబ్బులను మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వెంటనే వాపసు చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి దళితబంధు పేరిట అవినీతికి పాల్పడ్డాడని, ప్రజాప్రతినిధులను ఉపయోగించుకుని ఈ నాలుగు మండలాల్లో 144మంది దళితుల నుంచి డబ్బులు దండుకున్నాడని ఆరోపించారు. వడ్డీతో సహా ముత్తిరెడ్డి డబ్బులు చెల్లించాలని, అందుకు ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యత వహించి న్యాయం చేయాలని కోరారు. అవినీతికి పాల్పడిన విషయమై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొంగరి వెంకట్‌మావో, పోలోజు శ్రీహరి, బండకింది అరుణ్, దాసరి ప్రశాంత్, బోయిని మల్లేశం, దాసరి చక్రపాణి, దర్శనం రమేశ్, రాళ్లబండి చందు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 3: లక్షా యాభై వేల ఆటో కార్మికుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 50 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టే విధంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంతో ఆటోడ్రైవర్లు అప్పుల పాలవుతున్నారన్నారు. వారు ఈఎంఐలు కట్టుకోలేక, కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రతీ ఆటో కార్మికుడికి నెలకు రూ.4వేలు అందజేయాలని, లేనిపక్షంలో గజ్వేల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఆటోలతో దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మొదట వారు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వంగపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

మద్దూరు, ఫిబ్రవరి 3 : మండలంలోని వంగపల్లి గ్రామంలో జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల నాయకులు మేక మల్లేశం ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎర్ర బచ్చల గణేష్, ఉపాధ్యక్షుడిగా పండుగ వేణుగోపాల్, కోశాధికారిగా చల్లా నర్సింహారెడ్డి, యూత్ అధ్యక్షుడిగా రాగి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గంగిరాజుకుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మఠం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.